దంచికొట్టిన వాన


ఉధృతంగా ప్రవహిస్తున్న వేదావతి హగరి నది


ఉద్దేహాళ్ వద్ద కళ్యాణదుర్గం-బళ్లారి రహదారి కాజ్‌వేపై ప్రవహిస్తున్న వరద నీరు

రాయదుర్గంటౌన్: నియోజకవర్గంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. రాయదుర్గంలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత బుధవారం తెల్లవారుజాము వరకు వర్షం దంచికొట్టింది. పట్టణంలోని కొలిమివీధి, రామస్వామి వీధి, ఈసేవా ఏరియా, మధుటాకీస్ ఏరియా, దుగ్గిలమ్మ గుడి వెళ్లే ప్రాంతాలు జలమయమయ్యాయి. కొండపై నుంచి వచ్చిన వర్షపునీటితో పాటు డ్రైనేజీలు పొంగిపొర్లడంతో కాలనీలు ముంపుకు గురయ్యాయి. డీ.హీరేహాళ్ మండలంలోని గొడిశలపల్లి, హిర్దేహాళ్ గ్రామాల వద్ద వాగు ఉధృతంగా ప్రవహించింది. రాయదుర్గం–బళ్లారి మార్గంలో రాకపోకలకు అంతరాయం కలిగింది. వర్షం కారణంగా రాయదుర్గం పట్టణానికి తాగునీటిని అందించే డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నీటి పథకానికి సంబంధించి రాయదుర్గం-కణేకల్లు రహదారిలో విద్యుత్ తీగలు తెగిపడటంతో యుద్ధ ప్రాతిపదికన మున్సిపల్ అధికారులు సరిచేసి బుధవారం నుంచి నీటి పంపింగ్‌ను ప్రారంభించారు.

138 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

రాయదుర్గం నియోజకవర్గంలో మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారు జాము వరకూ 138 మి.మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. అత్యధికంగా రాయదుర్గంలో 64.2 మి.మీ, గుమ్మఘట్ట 40.2 మి.మీ, డీ.హీరేహాళ్‌లో 18.8 మి.మీ, కణేకల్లులో 14.2 మి.మీ వర్షపాతం నమోదైంది. వరుసగా రెండు రోజుల నుంచి కురిసిన వర్షానికి రాయదుర్గం నియోజకవర్గవ్యాప్తంగా 290 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

పలు కాలనీలు బురదమయం

వరుసగా కురుస్తున్నా వర్షాలతో పట్టణంలో పలు కాలనీలు బురదమయంగా మారాయి. మరికొన్ని చోట్ల వర్షపునీరు నిల్వ ఉండి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని మధు థియేటర్‌కు వెళ్లే దారిలో వర్షపు నీరు పెద్ద ఎత్తున నిల్వ ఉండటంతో అటుగా వెళ్లేవారు అవస్థలు పడుతున్నాయి. అలాగే మట్టి రహదారైన 17వ వార్డు దుగ్గిలమ్మ ఆలయానికి వెళ్లే రోడ్డులో గుంతల్లో నీరు ఉండి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. 4వ వార్డులోని కొలిమివీధి, మీసేవా ఏరియా, రామస్వామివీధిల్లో భారీ ఎత్తున బురద పేరుకుపోయింది.

పొంగిపొర్లిన వాగులు, వంకలు

బొమ్మనహాళ్: మండలంలో బుధవారం తెల్లవారు జామున కుండపోత వర్షం కురిసింది. వేదావతి హగరి నదితో పాటు వాగులు, వంకలు పొంగిపొర్లాయి. కర్ణాటక ప్రాంతంలో భారీ వర్షం కురవడంతో ఉద్దేహాళ్ వేదావతి చిన్న హగరికి భారీ వరదనీరు రావడంతో కళ్యాణదుర్గం-బళ్లారి కాజ్‌వేపై వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో ప్రధాన మార్గంలో రాకపోకలు పూర్తిగా ఆటంకం కలిగింది. వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మండలంలోని శ్రీధరఘట్ట, గోనేహాళ్, బండూరు, శింగానహళ్లి, కొలగానహళ్లి, లింగదహాళ్ తదితర గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. బండూరు, కల్లుదేవనహళ్లి గ్రామాల వద్ద లోతట్టు ప్రాంతాల్లో సాగుచేసిన వేరుశనగ, సజ్జ, అనుపకాయలు, చోళకాయలు పంటలు నీట మునిగాయి. బండూరు వద్ద వంకలో భారీగా నీరు రావడంతో కాలేజీలకు వచ్చే విద్యార్థులు ఎన్నో అవస్థలు పడ్డారు.


మధుటాకీస్ రోడ్డులో మూడు రోజులు గా నిల్చిపోయిన వర్షపు నీరు


రాయదుర్గం పట్టణంలో మంగళవారం అర్ధరాత్రి కురుస్తున్న వర్షం


బొమ్మనహాళ్‌లో నీట మునిగిన పంటలు

క్లుప్తంగా

డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు


మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ హర్షలత

కళ్యాణదుర్గం రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ హర్షలత, కళాశాల పౌర సంబంధాల అధికారి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీధర్ బుధవారం తెలిపారు. కళాశాలలో 9 మేజర్ కోర్సులు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయన్నారు. అనుభవం గల ఆధ్యాపకులతో విద్యాబోధన, అత్యాధునిక ల్యాబ్, జేకేసీ, అతి పెద్ద లైబ్రరీ ఆడిటోరియం, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్, ఎన్ఎస్ఎస్ అందుబాటులో ఉన్నాయన్నారు. మారుతున్న విద్యావిధానానికి అనుగుణంగా విద్యార్థులకు కంప్యూటర్‌పై ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు కళాశాలలో సంప్రదించాలన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

కళ్యాణదుర్గం రూరల్: ఈ ఏడాది ఖరీఫ్‌లో పంట సాగు చేసిన రైతులు ఈ–క్రాప్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఉద్యాన శాఖ అధికారి కృష్ణతేజ తెలియజేశారు. బుధవారం ఒంటిమిద్ది గ్రామంలో రైతులు సాగుచేసిన పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్రాప్ బుకింగ్ నమోదు చేసుకోకపోతే ప్రభుత్వం ఇచ్చే రాయితీలు, పంట నష్ట పరిహారం, వాతావరణ బీమా అందవన్నారు. పొలం బీడుగా ఉన్న గట్లపై వేసిన చెట్లకు కూడా ఈ పంట నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పరాకాష్టకు కూటమి రాక్షస పాలన

కళ్యాణదుర్గం రూరల్: రాష్ట్రంలో కూటమి రాక్షస పాలన పరాకాష్టకి చేరిందని బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలారి వెంకటేశులు బుధవారం ఓ ప్రకటనలో విమర్శించారు. పులివెందులలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై టీడీపీ గుండాలు దాడికి పాల్పడడం దారుణమని పేర్కొన్నారు. పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ఓటమి భయంతోనే కూటమి నేతలు అల్లర్లు చేస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై ఖండిస్తూ గురువారం అనంతపురంలోని మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఒకేషనల్ కోర్సులు ప్రవేశపెట్టాలి



రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఉరవకొండ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలో ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ తదితర ఒకేషనల్ కోర్సులు ప్రవేశపెట్టాలని ఎస్ఎఫ్ఐ నేతలు డిమాండ్ చేశారు. బుధవారం ఉరవకొండ తహసీల్దార్ మహబూబ్ బాషాకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి హరూన్‌రషీద్ మాట్లాడుతూ.. జూనియర్ కళాశాలకు ఇప్పటి వరకు ఒక్క పీడీ పోస్టు కుడా మంజురు కాలేదన్నారు. దీంతో ఇంటర్ విద్యార్థులు క్రీడలకు దూరం కావాల్సి వస్తోందన్నారు. కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాజేష్, సిద్దార్థ్, పవన్, కార్తిక్ పాల్గొన్నారు.

సీపీఐ సీనియర్ నేత శివన్న మృతి

ఉరవకొండ: పట్టణానికి చెందిన సీపీఐ సీనియర్ నేత ఎస్ శివన్న (73) బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బెంగళూరులో చికిత్స తీసుకున్నారు. బుధవారం ఉదయం ఇంట్లోనే కన్నుమూశారు. శివన్న తాలుకా ప్రధాన కార్యదర్శిగా, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి, ప్రజానాట్య మండలి సభ్యుడిగా వివిధ హోదాల్లో పని చేశారు. శివన్న మృతిపై సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, పార్టీ నాయకులు జగదీష్, మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి సంతాపం తెలిపారు.

బీటీపీకి వరద నీరు


కర్ణాటక నుంచి బీటీపీకి వస్తున్న వరదనీరు

గుమ్మఘట్ట: మండలంలోని బీటీపీ ప్రాజెక్టుకు బుధవారం వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టుకు ఎగువున ఉన్న కర్ణాటక రాష్ట్రంలో ఇటీవల వర్షాలు కురుస్తుండడంతో బీటీపీకి వరదనీరు వచ్చి చేరుతుండడంతో రైతుల ఆశలు చిగురిస్తున్నాయి. 100 క్యూసెక్కుల వరదనీరు వచ్చే అవకాశం ఉందని జలవనరులశాఖ అధికారులు చెబుతున్నారు.

కూటమి ప్రభుత్వంలో ప్రజాస్వామ్యం ఖూనీ

కూడేరు: పులివెందులలో జరగనున్న జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ఆ స్థానాన్ని దక్కించుకునేందుకు కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు దేవేంద్ర ధ్వజమెత్తారు. బుధవారం కూడేరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. పులివెందులలో వైఎస్సార్‌సీపీ నేతలపై టీడీపీ గుండాలు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై టీడీపీ మూకలు దాడికి దిగడం దారుణమన్నారు. రమేష్ యాదవ్ దాడిని రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల అందరిపై జరిగిన దాడిగా పరిగణించాలన్నారు. పోలీసులు ఒక శాసన మండలి సభ్యుడికి కనీస భద్రత కల్పించలేరా? అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ నేతలపై టీడీపీ నేతలు దాడులు చేస్తుంటే పోలీసులు మద్దతిస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ నేతలు ఎన్ని కుట్రలు చేసిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థే గెలుపొందడం ఖాయమన్నారు. పులివెందులలో శాంతి భద్రతలను కాపాడేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని చేశారు. సమావేశంలో బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోగుల పుల్లయ్య, కార్యదర్శి నవీన్ కుమార్ పాల్గొన్నారు.

చంద్రబాబు అంటేనే మోసం, అబద్ధం


కుర్లగుండలో చంద్రబాబు మోసాలను మహిళలకు వివరిస్తున్న నాయకులు


చాపిరి గ్రామంలో మాట్లాడుతున్న మండల కన్వీనర్ గోళ్ల సూరి

బ్రహ్మసముద్రం : సీఎం చంద్రబాబు అంటేనే మోసం, అబద్ధమని వైఎస్సార్‌సీపీ నాయకులు విమర్శించారు. బుధవారం కుర్లగుండ, బొమ్మగానిపల్లి, యనకల్లు, కన్నేపల్లిలో మండల కన్వీనర్ పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో రీ కాలింగ్ చంద్రబాబూస్ –మేనిఫెస్టో కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు కోనాపురం గంగాధరప్ప, ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌రెడ్డి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో ఏ గడపకు వెళ్లినా జగన్ అంటే సంక్షేమం, చంద్రబాబు అంటే మోసం, అబద్ధమని అంటున్నారని గుర్తు చేశారు. సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయకుండా కాలక్షేపం చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని గద్దె దించాలన్నారు. అనంతరం పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగిరేలా ప్రతి కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు. మాజీ ఎంపీపీ మహదేవప్ప, వైస్ ఎంపీపీ వెంకటనాయక్, ఎంపీటీసీ తిప్పేస్వామి, మండల ఉపాధ్యక్షులు నాగరాజురెడ్డి, రాము, అనుబంధ సంఘాల నాయకులు గోపాల్‌రెడ్డి, సునిల్, అభిలాష్‌రెడ్డి, శంకర్‌నాయక్, మంజు, గంగాధర, సర్పంచ్‌లు ఆదినారాయణరెడ్డి, రామ్మోహన్, శంకరప్ప, గంగాధర, నాయకులు ఆదినారాయణ, శ్రీనివాసులు, లింగమయ్య, నటరాజ, సోము, మారుతి, ప్రశాంత్, రాము తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: కూటమి ప్రభుత్వం దగా పాలనని ప్రజలకు తెలియజేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోళ్ల సూరి నాయకులకు పిలుపునిచ్చారు. బుధవారం హులికల్లు, కొత్తూరు పంచాయతీల్లో బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది కాలంలోనే రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. పేద, మధ్య తరగతి జీవితాలు చిన్నాభిన్నమయ్యాయన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ ఆంజినేయులు, లాయర్ హనుమంతురెడ్డి, కొత్తూరు సర్పంచ్ రాయపాటి నాగమణిబాబు, బోరంపల్లి రామిరెడ్డి, చిత్తయ్య, పాండు, మల్లి, బుదేప్ప, దొణస్వామి, సురేష్, మల్లి, మోహన్, తిమ్మరాజు, నరసింహ, ఈరన్న, నరసింహులు, గంగప్ప, రామకృష్ణ, ఓబులేష్, చంద్ర, గోపాల్, అనిల్, చంద్ర, రమేష్, ఈరన్న, తదితరులు పాల్గొన్నారు.


వివిధ ఆకృతుల్లో తయారవుతున్న మట్టి గణపతులు

ముస్తాబవుతున్న గణపయ్యలు

రాయదుర్గంటౌన్: వినాయక చవితి సమీపిస్తుండడంతో రాయదుర్గంలో చవితి సందడి వాతావరణం నెలకొంది. కోల్‌కత్తాకు చెందిన కళాకారులు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసుకుని మట్టి గణపతులకు జీవం పోస్తున్నారు. పర్యావరణ హితమైన మట్టితో మంత్రముగ్ధులను చేసేలా వివిధ కళాకృతుల్లో వాటిని ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. కోల్‌కత్తా నుంచి సునీల్‌గుప్త అనే కళాకారుడు తన బృందంతో పట్టణంలోని నేసేపేటలో గల పద్మశాలియ నూతన కళ్యాణ మంటపంలో ఏర్పాటు చేసిన తయారీ శిబిరంలో వినాయక మట్టి ప్రతిమలు సిద్ధం చేస్తున్నారు. ఈ నెల 27 నుంచి వినాయక చవితి ఉత్సవాల్లో ప్రారంభమవుతాయి.



అర్హులైనా 'తల్లికి వందనం' రాలేదు


జక్కలవడికి గ్రామంలో మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కణేకల్లు: అర్హులైనప్పటికీ తమకు తల్లికి వందనం రాలేదని పలువురు తల్లులు ఆవేదన వ్యక్తం చేశారు. జగనన్న పాలనలో 'అమ్మఒడి' వచ్చేదని, చంద్రబాబు పాలనలో 'తల్లికి వందనం' రాలేదన్నారు. మండలంలోని జక్కలవడికి గ్రామంలో బుధవారం 'బాబూ ష్యూరిటీ... మోసం గ్యారంటీ' కార్యక్రమం జరిగింది. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కన్నారి ఉషారాణి, జిల్లా కోశాధికారి పాటిల్ నాగిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మారెంపల్లి మారెన్న, సర్పంచు శారద, ఎంపీటీసీ వెంకట్రామిరెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు హనుమంతరెడ్డి, బి.రామక్రిష్ణ, టైలర్ వెంకటేశులు ఇంటింటికీ వెళ్లి కూటమి సర్కారు హామీచ్చిన పథకాలన్నీ అందుతున్నాయా? లేదా? అని అడిగి తెలుసుకొన్నారు. దీంతో పలువురు తల్లికి వందనం డబ్బులు పడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి హళ్లి నాగరాజు, బోయ రమేష్, భీమిరెడ్డి, గిర్రప్పరెడ్డి, అయ్యప్పరెడ్డి, భోగిరెడ్డి, అనిల్, యర్రగుంట గోవర్ధన్‌రెడ్డి, వై.హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యం


ఉరవకొండ: వివాహానికి హాజరైన వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త విశ్వ

ఉరవకొండ: పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా నాయకురాలు కొర్రా నిర్మలమ్మ, సక్రియా నాయక్ దంపతుల కుమారుడి వివాహం బుధవారం కదిరి పట్టణంలోని ఓ పంక్షన్ హాల్‌లో జరిగింది. మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి వివాహానికి హాజరై, వధూవరులు ఉదయ్ కుమార్, వెంకటలక్ష్మిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చందాచంద్రమ్మ, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సీపీ వీరన్న, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

రాయదుర్గంటౌన్: పట్టణంలో ఆదివారం జరిగిన పలు వివాహ శుభకార్యాలకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి హాజరయ్యారు. శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో జరిగిన యశ్వంత్‌కుమార్, వర్ష వివాహానికి, అలాగే బళ్లారిలో జరిగిన శశిధర్‌రెడ్డి, చందన వివాహానికి, వెంకటనాగార్జునరెడ్డి, జాహ్నవి వివాహానికి హాజరై దంపతులను ఆశ్వీరదించారు. ఆయనతోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.


వేణుగోపాలస్వామి ఆలయంలో జరిగిన వివాహానికి హాజరైన మెట్టు గోవిందరెడ్డి

11 నుంచి సత్యసాయి కార్మికుల సమ్మె బాట

కళ్యాణదుర్గం రూరల్: శ్రీసత్యసాయి తాగునీటి పథకం కార్మికులు ఈనెల 11 నుంచి సమ్మెలోకి వెళ్లనున్నట్లు శ్రీసత్యసాయి తాగునీటి పథకం కార్మిక సంఘం కోశాధికారి వన్నూరప్ప బుధవారం తెలిపారు. నాలుగు నెలలుగా కార్మికులకు వేతనాలు అందలేదన్నారు. సంబంధిత అధికారులకు పలు మార్లు కలిసి తమ సమస్యలు వివరించాన ఫలితం లేకుండా పోయిందన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 11 నుంచి సమ్మె చేస్తున్నామన్నారు. కార్మికులు ఎర్రిస్వామి, హనమంతు, గంగన్న పరుశురాం, లక్ష్మణ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

పట్టు పురుగుల పెంపకంపై అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కుందుర్పి: మండలంలోని ఎనుములదొడ్డి గ్రామంలో పట్టుపరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో నా పట్టు– నా ప్రాణం అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టు పురుగులకు సోకే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. మల్బరీ పంటలో చీడపీడల నివారణకు తీసుకోవాల్సి చర్యలను తెలియజేశారు. కార్యక్రమంలో డీఎస్ఓ విజయకుమారి, శాస్త్రవేత్తలు డాక్టర్ మురళి, డాక్టర్ రమ్య, అరుణ, టీఓలు టీఏలు, పట్టు రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ


ట్రోఫీ చూపుతున్న జెడ్పీ సెంట్రల్ పాఠశాల విద్యార్థినులు

ఉరవకొండ: స్థానిక ప్రభుత్వ జెడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించినట్లు హెచ్‌ఎం రాజేశ్వరి, పీడీలు మారుతీ ప్రసాద్, రాఘవేంద్ర తెలిపారు. బుధవారం పాఠశాల ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. మదనపల్లిలో ఈనెల 4 నుంచి 5 వరకు రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ బాలికల ఫుట్‌బాల్ పోటీలు జరిగాయన్నారు. అనంతపురం జిల్లా జట్టు తరపున పాఠశాలకు చెందిన అమృత, అంజలి, అనీషా, వైషాలి, భవ్య, అంజలి, సఫీయా, సరితాబాయి ప్రాతినిథ్యం వహించారన్నారు. ఫైనల్స్‌లో కడప జిల్లాతో హోరాహోరీగా పోటీ పడి జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించిన విద్యార్థినులను పాఠశాల ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించింది.

జాతీయ నాయకుల చిత్రాల వితరణ

గుమ్మఘట్ట: మండలంలోని అడిగుప్ప ప్రాథమిక పాఠశాలకు శ్రీకల్కి మానవసేవా సమితి సభ్యులు జాతీయ నాయకుల చిత్రపటాలను బుధవారం వితరణ చేశారు. మహాత్మాగాంధీ, జవహార్‌లాల్ నెహ్రూ, డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, తాంతియాతోపే, స్వామి వివేకానంద, భరతమాత, భగత్‌సింగ్, సర్దార్‌వల్లబాయ్‌పటేల్, పొట్టి శ్రీరాములు తదితరుల ఫోటోలను పాఠశాలకు బహూకరించడంతో పాఠశాల ఉపాధ్యాయుల బృందం, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఎంఈఓ సోమశేఖర్, హెచ్‌ఎం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భూవివాదంపై కేసు నమోదు

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్‌లో భూమి తగాదాలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నబీరసూల్ తెలిపారు. ఉద్దేహాళ్‌కు చెందిన రాజమ్మ అనే మహిళకు చెందిన భూమిని అదే గ్రామానికి చెందిన అనిల్‌కుమార్, గురుస్వామి, వెంకటనారాయణ భూమి హద్దులు చెరిపి, భూమి సాగుకు నీళ్ల మళ్లించడమే కాకుండా బెదిరిస్తున్నట్లు రాజమ్మ ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. రాజమ్మ ఇప్పటికే భూమిని కౌలుకు ఇచ్చిందని, రైతులు సాగు చేయనియకుండా గట్లు చెరిపి పొలానికి నీరు పెట్టినట్లు తెలిపారు. ఇదేమని ప్రశ్నిస్తే గతంలో తాము హత్య చేసి జైలుకు పోయి వచ్చాం తెలియదా అని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు.

విరిగిపడ్డ రైల్వేగేటు


ఆటో ఢీకొనడంతో విరిగి ఆటోపై పడిన గేటు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని అనంతపురం ప్రధాన రహదారిలోని రైల్వేగేటును ఆటో ఢీకొనడంతో విరిగి పడింది. బుధవారం మధ్యాహ్నం సమయంలో ఓ గూడ్స్ రైలు కోసం గేట్‌మ్యాన్ గేటు దించుతుండగా వేగంగా వచ్చిన ఓ ఆటో ఢీకొనడం గేటు విరిగింది. అప్రమత్తమైన గేట్‌మ్యాన్, కొందరు యువకులు గూడ్స్ రైలు వెళ్లే వరకు ట్రాఫిక్‌ను కట్టడి చేసి వాహనాలు ముందుకు వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ


ఎరువుల స్టాక్ వివరాలపై ఆరా తీస్తున్న తహసీల్దార్ అనిల్‌కుమార్

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని మన గ్రోమోర్, సంకల్ప ఎరువుల దుకాణాలను బుధవారం తహసీల్దార్ అనిల్‌కుమార్, ఏఓ పృథ్వీసాగర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోదాముల్లో ఉన్న ఎరువుల స్టాక్ రిజిష్టర్లు, నమోదు చేసిన ఎరువుల వివరాలపై ఆరా తీశారు. ఎరువులకు సంబంధించిన లైసెన్స్‌ను పరిశీలించారు. అవకతవకలకు పాల్పడితే ఎరువుల దుకాణాలపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్ ముసాయిదాపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అహుడా పీఓ ఇషాక్, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి

రాయదుర్గంటౌన్: పట్టణానికి సంబంధించి ఇటీవల విడుదల చేసిన మాస్టర్ ప్లాన్ ముసాయిదా (డ్రాఫ్ట్)పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అహూడా ప్లానింగ్ ఆఫీసర్ ఇషాక్, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి సూచించారు. బుధవారం స్థానిక మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు, వీఆర్‌ఓలు, అడ్మిన్లతో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. రాయదుర్గం పట్టణ ప్రణాళిక విభాగం అధికారి మురళీమోహన్‌తో కలిసి సిబ్బందికి అవగాహన కల్పించారు. విడుదల చేసిన పట్టణ మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్‌పై సచివాలయ సిబ్బంది పూర్తిస్థాయి అవగాహన కలిగి తర్వాత ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంటుందన్నారు. మాస్టర్ ప్లాన్ ముసాయిదాపై అభ్యంతరాలు, సూచనలు కచ్చితంగా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 25వ తేదీ వరకూ అభ్యంతరాలు గడువు ఉండడంపై సచివాలయ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. గడువులోగా ముసాయిదాకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే దానిప్రకారం మార్పులు, చేర్పులు ఉండే అవకాశం ఉంటుందని, లేనిపక్షంలో ఫైనల్ డ్రాఫ్ట్ విడుదల చేసే అవకాశం ఉంటుందన్నారు.